వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 89
పేజీలు : 06 | వెల: రూ.5/-
సోమవారం
డిసెంబర్ 23, 2024
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


2లో..

## గంజాయి మత్తు వదిలించాలి

- నియంత్రణకు పటిష్టమైన చర్యలు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద


8లో..

## క్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకం

- దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- కలెక్టర్, మేయర్ తో కలిసి ముందస్తు క్రిస్మస్ వేడుకలు


8లో..

## సరళీకృత విధానాల సృష్టికర్త పీవీ

- దేశానికి సరికొత్త మార్గాన్ని చూపిన దార్శనికుడు
- కొనియాడిన ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు
- వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన నేతలు


8లో..



## మీకు అండగా ఉంటాం..


- సర్వశిక్ష అభియాన్ లో ఉద్యోగాలు ఇచ్చింది మేమే
- దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపిన మాజీ మంత్రి హరీష్ రావు



# విదేశాల్లో.. విషాదాలు


వివరాలు 2లో..

- ప్రాణాలు తీస్తున్న ఉన్నత విద్య
- గత ఐదేళ్లలో 633కి పైగా మృతి
- తాజాగా హనుమకొండ జిల్లా యువకుడు
- కారులోనే విగత జీవిగా కనిపించిన బండి వంశీ
- కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు



ఉన్నత చదువులకోసం విదేశాలకు వెళ్తున్న పలువురు విద్యార్థులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలచివేస్తోంది. ఉన్నతులుగా తిరిగి వస్తారనుకున్న వారు కానరాని లోకాలకు పోవడంతో ఆయా కుటుంబాలు విషాద ఛాయల్లో మునిగిపోతున్నాయి. విదేశాలకు పంపేందుకు చేసిన అప్పులు అలాగే మిగిలి పోగా విగత జీవిగా వచ్చిన కొడుకును చూసి ఆ కుటుంబం రోదిస్తున్న తీరు అందరికీ కంట తడి తెప్పిస్తోంది. చేసిన అప్పులు తీరక కొన్ని కుటుంబాలు రోడున పడుతున్న సంఘటనలూ ఉన్నాయి. విదేశాల్లో ఉన్నత చదువులకోసం వెళ్లి మృతి చెందుతున్న వారిలో భారత దేశానికి చెందిన విద్యార్థులే అధిక సంఖ్యలో ఉన్నట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించడం ఆందోళన కలిగిస్తోంది. గడచిన ఐదేళ్లలో విదేశాల్లో చదువుతున్న భారతీయ విద్యార్థులు 633 మంది ప్రాణాలు కోల్పోయారని భారత ప్రభుత్వం షాకింగ్ వివరాలను వెల్లడించింది. అయితే ఈ గణాంకాలు జూలై 2024 వరకు మాత్రమే. ఆ తర్వాత కూడా ఎంతో మంది విద్యారులు విదేశాల్లో అనుమానాస్పద స్థితిలో కన్ను మూశారు. వీరిలో చాలా మంది విద్యార్థులు ఎందుకు మృతి చెందారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగానే మిగిలిపోతోంది. తాజాగా హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మాదన్నపేట గ్రామానికి చెందిన గీత కార్మికుడు బండి రాజయ్య–లలిత దంపతుల కుమారుడు వంశీ (25) కూడా అనుమానాస్పదంగానే మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది.

– వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి

# విదేశాల్లో విషాదాలు



- ప్రాణాలు తీస్తున్న ఉన్నత విద్య
- గత ఐదేళ్లలో 633కి పైగా మృతి
- తాజాగా హనుమకొండ జిల్లా యువకుడు
- కారులోనే విగత జీవిగా కనిపించిన బండి వంశీ
- కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు

**వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి :** ఉన్నత చదువులకోసం కన్న కొడుకులకు విదేశాలకు పంపితే వారు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి సంఘటనలు నిత్యకృత్యంగా మారడాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఉన్నత చదువులకోసం లక్షల రూపాయలు అప్పు చేసి విదేశాలకు పంపిస్తే విగత జీవిగా మారడాన్ని తట్టుకోలేక పోతున్నారు. విదేశాల్లో మృతి చెందిన తమ కన్న ప్రేగు చివరి చూపు కోసం తల్లిదండ్రుల, బంధువులు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. వారి పార్థీవ దేహాలను స్వగ్రామానికి తెప్పించేందుకు పలుకుబడి కలిగిన రాజకీయ నాయకుల సపోర్ట్ తో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖను ఆశ్రయించాల్సి వస్తోంది. కడసారి చూపు కోసం రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది.

## తాజాగా వంశీ..

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మాదన్న పేటకు చెందిన కల్లుగీత కార్మికుడు బండి రాజయ్య–లలిత దంపతుల కుమారుడు వంశీ శనివారం రాత్రి అమెరికాలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. బండి రాజయ్య–లలిత దంపతులకు ఇద్దరు కుమారులు కాగా వీరిలో చిన్నవాడు వంశీ. విదేశాల్లో ఎంఎస్ చదువాలన్న ఆకాంక్షతో 2023 జూలైలో అమెరికాలోని మిన్నెసొటాకు వెళ్లారు. అక్కడి కాంకోర్డియా సెయింట్ పాల్ విశ్వవిద్యాలయంలో చదువుతున్నారు. ఇటీవలే పార్ట్ టైం ఉద్యోగంలో చేరారు. అయితే శనివారం రాత్రి అపార్ట్ మెంట్ కింద ఉన్న సెల్లార్ లో పార్క్ చేసి ఉన్న కారులో వంశీ ఉరి వేయబడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని తరలిస్తున్న సమయంలో పక్క అపార్ట్ మెంట్ లో ఉంటున్న హనుమకొండకు చెందిన విద్యార్థులు గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు.



## విషాద ఛాయలు..

వంశీ మృతితో మాదన్నపేటలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇక కష్టాలు తీరుతున్నాయ్ అనుకుంటున్న సమయంలో చెతికందవచ్చిన కుమారుడు మృతి చెందడాన్ని వారు తట్టుకోలేక పోతున్నారు. కొడుకును తలచుకుంటూ వారు కన్నీరు పెడుతున్న ధృష్యాన్ని చూసి స్థానికులు కూడా కంటతడి పెట్టుకుంటున్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో వంశీ స్వగ్రామానికి చేరుకొని బండి రాజయ్య–లలితకు అండగా నిలుస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వంశీ మృతదేహాన్ని త్వరితగతిన స్వస్థలానికి తెప్పించడంతోపాటు మృతికి కారకులను గుర్తించి కఠినంగా శిక్షించాలని వేడుకుంటున్నారు.

## ఐదేళ్లలో 633 మంది..

గత ఐదేళ్లలో విదేశాల్లో చదువుతున్న భారతీయ విద్యార్థులు 633 మంది ప్రాణాలు కోల్పోయినట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రమాదాలు, వైద్య పరిస్థితులు, దాడులు వంటి కారణాల వల్ల 2019 నుంచి జూలై 2024 వరకు 41 దేశాల్లో వీరు మృతి చెందినట్లు చెప్పారు. కాగా, కెనడాలో అత్యధికంగా 172 మంది భారతీయ విద్యార్థుల మరణించారు. ఆ తర్వాత 108 మరణాలతో అమెరికా రెండో స్థానంలో ఉంది. బ్రిటన్‌లో 58, ఆస్ట్రేలియాలో 57, రష్యాలో 37, జర్మనీలో 24, ఇక్రెయిన్ లో 18, జార్జియా, కిర్గిజ్సాన్, సైప్రస్‌లలో 12, పక్కనున్న చైనాలో 8, పాకిస్థాన్‌లో ఒక భారతీయ విద్యార్థి మృతి చెందినట్లు ప్రకటించారు. మరోవైపు విదేశాల్లో జరిగిన దాడుల్లో 19 మంది భారతీయ విద్యార్థులు మరణించినట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. కెనడాలో జరిగిన దాడుల్లో అత్యధికంగా తొమ్మిది మంది, అమెరికాలో ఆరుగురు మరణించారు. ఆస్ట్రేలియా, చైనా, బ్రిటన్, కిర్గిజ్‌స్థాన్‌లో జరిగిన దాడుల్లో ఒక్కరు చొప్పున ఇండియన్ స్టూడెంట్స్ చనిపోయారు. అయితే జూలై నుంచి ఇప్పటి వరకు మరికొంతమంది విద్యార్థుల ప్రాణాలు గాలిలో కలిసి పోయిన వాటి వివరాలు మాత్రం వెల్లడికాలేదు.

# గంజాయి మత్తు వదిలించాలి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాలో మత్తు పదార్థాలు, మారకద్రవ్యాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మత్తు పదార్థాల నియంత్రణపై డీసీపీ రవీందర్ తో కలసి సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. యువత చెడు వ్యసనాలకు గురి కాకుండా చూడాలన్నారు. విద్యాసంస్థల సమీపంలో కిరాణ షాపుల వేదికగా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయించకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్, నర్సంపేట ఆర్డీఓలు సత్యాపాల్ రెడ్డి, ఉమారాణి, ఏసీపీలు మామునూర్ తిరుపతి, సైదులు, కిరణ్ కుమార్, జిల్లా వైద్యశాఖ అధికారి సాంబశివరావు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# శ్రద్ధతో చదవాలి..
## ఉత్తమ ఫలితాలు సాధించాలి
**- శివశంకర్ రావు**




**వరంగల్ వాయిస్, జనగామ :** విద్యార్థులు శ్రద్ధతో చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని లయన్స్ క్లబ్ జనగామ బి బాయ్స్ అధ్యక్షుడు డాక్టర్ డి.శివశంకర్ రావు అన్నారు. తమ క్లబ్ ఆధ్వర్యంలో నర్మెట మండలం అమ్మాపూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్, ఎగ్జామ్ ప్యాడ్స్ వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు తోట రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో శివ శంకర్ రావు మాట్లాడుతు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. లయన్స్ క్లబ్ కార్యక్రమాల గురించి వివరిస్తూ ఎక్కడ సేవలు అవసరమో అక్కడ లయన్ చేరుతుందన్నారు. అదే స్ఫూర్తితో మీ పాఠశాలకు రావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు బి.బాలభరద్వాజ్, కార్యదర్శి బాలకృష్ణ, కోశాధికారి కె.అనిల్ కుమార్, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ కన్న శ్రీనివాస్, రాము, ఉపాధ్యాయులు ఎం.అంబదాస్, కె.రమేశ్, పి.భాస్కర్, సీహెచ్ మహేందర్, ఎం.రమేశ్, వై.సరళ, ఎం.మంజుల తదితరులు పాల్గొన్నారు.




# కేంద్రీయ విద్యాలయలో గణిత దినోత్సవం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజం పుట్టిన రోజు సందర్భంగా వరంగల్ బట్టుపల్లిలోని కేంద్రీయ విద్యాలయంలో పీజీటీ గణిత శాస్త్రం ఉపాధ్యాయుడు రాగి ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో గత మూడు రోజులపాటు గణిత ప్రదర్శన, ఆర్య భట్ట గణిత ఛాలెంజ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టిస్టు దీపక్ సూత్రాల ద్వారా శ్రీనివాస రామానుజం, శ్రీనివాస రామానుజం స్టూడెంట్స్ తో 11వ తరగతి విద్యార్థులు త్రికోణమితి సూత్రాల పాట, 6 వ తరగతి విద్యార్థుల రేఖా గణితం డాన్స్ అందరినీ ఆకట్టుకుందని ప్రిన్సిపల్ పి.సుభాషిణి తెలిపారు. ఉపాధ్యాయుడు ఉదయ్ చొరవతో వారి మెలకువతో, పాటల డాన్స్ ద్వారా గణితం నేర్పించటం ద్వారా పిల్లల్లో గణితంపై ఇష్టం పెరిగిందని చెప్పారు. ఇందులో టీజీటీ గణిత ఉపాధ్యాయులు సంధ్య, స్రవంతి వివిధ పాఠ్యాంశ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రంయ్యాల శ్రీధరాచార్యులకు.. భారత భూషణ్ అవార్డు

- సత్కరించిన వల్లూరి, ప్రగతి ఫౌండేషన్




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నగరంలోని ఎల్ బీ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న రంయ్యాల శ్రీధరాచార్యులను భారత్ భూషణ్ అవార్డుతో సన్మానించారు. హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో వల్లూరి ఫౌండేషన్, ప్రగతి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీధరాచార్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ కోదండరామ్, అతిథులుగా తెలంగాణ సినీ ఫిలిం చాంబర్ చైర్మన్ డాక్టర్ రామకృష్ణ గౌడ్, సినీ హీరో మాణిక్ రావు, దైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు. వల్లూరి, ప్రగతి ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస రాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు క్రిష్ణవేణి, అసోసియేట్ అధ్యక్షులు సుధాకర్ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారికి అవార్డులతో సన్మానించారు. శ్రీధరా చార్యులు పాడిన రారా బడికి రా రెండు తెలుగు రాష్ట్రాల్లో బహుళ ప్రాచుర్యం పొందింది. న్యూఢీల్లిలో, కర్ణాటకలోని బెంగళూరు, గుజరాత్ లోని సూరత్, మహరాష్ట్రలోని తెలుగు వారికి కూడ తన మాటతో పాటతో అహ్లాద పరిచారు. అవార్డులు మరింత బాధ్యతలను పెంచుతాయని రంయ్యాల శ్రీధరాచార్యుల తెలిపారు.

# నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానంతో నష్టం

## ➲ అమలు చేసేందుకు మోడీ కుట్ర



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయకుండా కేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులు దోచుకునేందుకు వీలుగా కేంద్ర నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని తీసుకువచ్చిందని, ఇది దేశ వ్యవసాయానికి, వాస్తవ సాగుదారులకు, ప్రజలకు ఎంతో హానికరమని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కే యం) రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్, జిల్లా కన్వీనర్లు ఈసంపల్లి బాబు సోమిడి శ్రీనివాస్ రాచర్ల బాలరాజు చిర్ర సూరి అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) ఆధ్వర్యంలో సోమవారం రైతు సంఘాల నాయకులు కార్యకర్తలు వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్ లో కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేపట్టి నూతన వ్యవసాయ మార్కెట్ విధాన పత్రాలను దగ్ధం చేసి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్కేఎం జిల్లా కన్వీనర్ కుసుంబా బాబురావు అధ్యక్షతన నిరసన కార్యక్రమంలో పెద్దారపు రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను అమలు చేయమని కనీస మద్దతు ధర చట్టం చేస్తామని హామీ ఇచ్చి ఆచరణలో దొడ్డిదారిన అవే నల్ల చట్టాల అమలుకు పూనుకుంటున్నారని మండిపడ్డారు. చావు తప్పి కళ్లు లొట్టబోయిన రీతిన ప్రజలు తీర్పునిచ్చిన బీజేపీ మోడీ ప్రభుత్వం తమ విధానాలను మార్చుకోకపోగా మరింత పదును పెట్టి దేశ వ్యవసాయాన్ని, రైతులను సంక్షోభంలోకి నెట్టే విధానాల రూపకల్పనకు ప్రయత్నిస్తున్నదని కనీస మద్దతు ధర చట్టానికి హామీ ఇచ్చి నేటికీ అమలుకు పూనుకోకపోవడం సిగ్గుచేటని, ఈ తరుణంలో గత చారిత్రాత్మక రైతాంగ ఉద్యమ బాటలో ఢిల్లీ సరిహద్దుల్లో ఉద్యమం ప్రారంభమైందని తెలిపారు. అట్టి రైతాంగ ఉద్యమంపై నిర్బంధాన్ని ప్రయోగిస్తూ రైతు ఉద్యమకారులను అరెస్టు చేసి అక్రమ కేసులు పెట్టి జైల్లోకి పంపారని, ఎస్కేయం జాతీయ నాయకుడు జగత్ సింగ్ దలైవాల 28 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తూ చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న కనీసం రైతు సంఘాలతో చర్చలు జరపాలనే స్పృహ కేంద్ర ప్రభుత్వానికి లేకపోవడం ఆవేదన కలిగిస్తుందన్నారు. ఇప్పటికైనా రైతు వ్యతిరేక విధానాలకి స్వస్తి పలికి రైతుల పంటలకు కనీస మద్దతు ధర చట్టాన్ని చేసి ఉత్పత్తి ఖర్చులను తగ్గించి దేశాన్ని కాపాడాలన్నారు. లేకపోతే రైతాంగ ఉద్యమం క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. వెంటనే నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, పంజాబీ సరిహద్దుల్లో రైతుల పోరాటంపై అణిచివేతను ఆపాలని, గ్రేటర్ నోయిడా జైల్లో ఉన్న రైతు నాయకులను విడుదల చేయాలని, రైతు సంఘాలతో తక్షణమే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్కేయం జిల్లా నాయకులు మహమ్మద్ ఇస్మాయిల్ సుధమల్ల భాస్కర్, వల్లందాస్ కుమార్, కొత్తూరి ఇంద్రసేన, ఐతం నాగేష్, సింగతి మల్లికార్జున్, ఓదెల రాజన్న, మైదం పాణి, బండి కుమార్, ఎండీ బషీర్, ఆరూరి కుమార్, ఎగ్గని మల్లికార్జున్, మాలి ప్రభాకర్, అప్పనపురి నరసయ్య, బొల్లు ఎల్లయ్య, చేరాలు పాల్గొన్నారు.

# మంత్రి సీతక్కను కలిసిన ఐకేపీ వీవోఏల జేఏసీ రాష్ట్ర కమిటీ



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** ఐకేపీ వీవోఏల జేఏసీ రాష్ట్ర కమిటీ పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూర్య సీతక్కను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర కమిటీ సభ్యులు అందరం కలిసి మంత్రి సీతక్కను పుష్పగుచ్ఛంతో సత్కరించారు. అనంతరం వీవోఏల జేఏసీ రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు మినుముల పద్మావతిని మంత్రి శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం వీవోఏల సమస్యల గురించి సెర్ప్ సీఈవోకు ఫోన్ చేసి వీవోఏల డ్రెస్ కోడ్, గ్రేడింగ్ విధానం, కటాఫ్ సీట్ గురించి నాకు వివరణ ఇవ్వమని కోరింది. అనంతరం మంత్రి ఈ నెల 27న మీరందరూ వస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు జామెట్రీ బాక్సుల పంపిణీ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని జులైవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ సోమవారం 100 జామెట్రీ బాక్సులను ఉచితంగా పంపిణీ చేసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ పాల్గొని చెన్నైకి చెందిన దాతలు సింగై శివ అన్బర్గల్ కుటుంబ సభ్యులు అందజేసిన పదివేల రూపాయల విలువ చేసే జామెట్రీ బాక్సులను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు తమ సొసైటీ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# క్రీడలు ప్రజలను ఐక్యం చేస్తాయి

## ➲ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**వరంగల్ వాయిస్, గణపురం :** క్రీడలు ప్రజలను ఐక్యం చేస్తాయని, పట్టుదలను పెంపొందిస్తాయని, సరిహద్దులను కలుపుతాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండలంలోని సీతారాంపురంలో సోమవారం వన్ వర్డ్ వన్ యూనియన్ యూత్ అసోసియేషన్ నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సెటిల్ ప్రీమియర్ లీగ్ సీజన్-2 టోర్నమెంట్ విన్నర్ టీంకు రూ.10000, రన్నర్ టీంకు రూ.5000 చెక్కులను ముఖ్య అతిథిగా హాజరై ఇస్తూ ఎమ్మెల్యే జీఎస్ఆర్ మాట్లాడుతూ ఆటల్లో ఓడిన వారు కుంగరాదని గెలిచినవారు పొంగ రాదన్నారు. తమ ప్రభుత్వం క్రీడలను ఎంతగానో అభివృద్ధి పరుస్తుందని క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహిస్తుందన్నారు. ఈ క్రీడోత్సవాల్లో పాల్గొన్న క్రీడాకారులు ఇక్కడితోనే ఆగిపోకుండా జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదిగి, తాము పుట్టిన గ్రామానికి తెలంగాణ రాష్ట్రానికి పేరు తేవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ రామేశ్వరరావు, సొసైటీ చైర్మన్ కే కుమార్, మాజీ కోఆప్షన్ ఎండీ చోటేమియా, ఎం.ఉపేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# పోగు అశోక్ కు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ అభినందనలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కరీమాబాద్ లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడు పోగు అశోక్ ను తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యా సంచాలకులు ఐఏఎస్ ఈ నరసింహారెడ్డి అభినందించారు. జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్సీఈఆర్టీ హైదరాబాద్ లో నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యాయుడు పోగు అశోక్ ఈ సంవత్సరం తెలంగాణ రాష్ట్రం నుంచి జాతీయ విద్యా సదస్సుకు ఎంపికైనందున తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ గాజర్ల రమేష్ ,ఎస్సీఆర్టీ సీనియర్ ప్రొఫెసర్ సురేష్ బాబు, రాంబాబు, రంగాచారి తదితరులు ఉపాధ్యాయుడు అశోకుని అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ వచ్చే నెల జాతీయ స్థాయిలో జరిగే విద్యా సదస్సులో చక్కని ప్రజెంటేషన్ ఇచ్చి మన రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అదేవిధంగా విద్యారంగంలో మరింతగా సేవలను అందించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** సీరోల్ మండలం ప్రభుత్వ పాఠశాల కాంపెల్లి తండా( సక్రం నాయక్ తండా) ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ధరం సోత్ శ్రీను విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తు అశ్లీల వీడియోలను చూపించాడని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల ప్రాథమిక విచారణ ఆధారంగా వెంటనే సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎ.రవీందర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని జిల్లా సంక్షేమ శాఖ( డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్), బాల రక్షా భవన్ మహబూబాబాద్ వారిని ఎంక్వైరీ కమిటీ వేసి సమగ్ర విచారణకు నియమించడం జరిగింది.

# ఐసెట్ నిర్వహణ బాధ్యతలు కేయూకే అప్పగించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గత 12 సంవత్సరాలుగా ఎలాంటి వివాదాలకు తావు లేకుండా కాకతీయ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఐసెట్ నిర్వహణ బాధ్యతలను మళ్లీ కాకతీయ విశ్వవిద్యాలయానికి కేటాయించే విధంగా చొరవ తీసుకోవాలని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఐసెట్ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయిన సందర్భంగా డాక్టర్ శేషు మాట్లాడుతూ 2012 నుంచి వరుసగా 12 సంవత్సరాలుగా కాకతీయ విశ్వవిద్యాలయమే ఐసెట్ నిర్వహణ బాధ్యతలను చేపడుతుంది. కానీ. 2025 ఐసెట్ నిర్వహణ బాధ్యతల నుంచి కేయూను తప్పించటం భావ్యం కాదన్నారు. కాబట్టి, రాష్ట్రంలో రెండవ అతిపెద్ద విశ్వవిద్యాలయమైన కాకతీయ యూనివర్సిటీకే మళ్లీ ఐసెట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించే విధంగా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఐసెట్ నిర్వహణ బాధ్యతలను మళ్లీ కేయూకే కేటాయించే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ దృష్టికి తీసుకెళ్తానని డాక్టర్ శేషు తెలియజేశారు.

# పోరాడితేనే పాత పింఛన్ సాధ్యం




**వరంగల్ వాయిస్, కొత్తవాడ :** సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే సరిపోదని, ప్రత్యక్షంగా పోరాడితేనే పాత పింఛను విధానాన్ని సాధించుకోవచ్చని టీఎస్ సీపీఎస్ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ పిలుపునిచ్చారు. ఆది వారం వరంగల్ ఇస్లామియా కళాశాల మైదానంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు జీవన్ కుమార్ అధ్యక్షతన 'కాకతీ' కదన భేరి పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ మాట్లాడారు. టీఎస్ సీపీఎస్ఈయూ మద్దతుతో గతంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిచినవారు మన సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. కేవలం మనల్ని ఓటర్లుగానే చూస్తున్నారని, ఇప్పుడు ఆ పరిస్థితి మార్చే అవకాశం వచ్చిందన్నారు. చట్ట సభల్లో మనకోసం మాట్లాడే వ్యక్తిని వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్నుకుందామన్నారు. ఉద్యోగ విరమణ, వృద్ధాప్యంలో పింఛను లేకపోవడం బాధాకరమైన పరిస్థితి అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి డా.కొలిపాక వెంకటస్వామి మాట్లాడుతూ సీపీఎస్ రద్దు పాత పింఛను పునరుద్ధరణతో పాటు ఉపాధ్యాయ, గురుకుల, మోడల్ పాఠశాలల అధ్యాపకుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. సభకు ఉద్యోగ ఉపాధ్యాయులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శ్రీకాంత్, నరేష్ గౌడ్, లింగమూర్తి, బుచ్చన్న, జిల్లా నాయకులు రవీందర్ రెడ్డి, అఫ్జల్, శ్రీనివాస్, లక్ష్మికాంత్, విక్రమ్, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ స్తంభాలు వేయించండి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావును ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు త్రోవను, మంద కొమురమ్మ నగర్ కాలని వ్యవస్థాపకుడు గుగ్గిళ్ల పీరయ్య మాదిగ కలిసి కాలనీ పరిస్థితి వివరించారు. మంద కొమురమ్మ నగర్ కాలనీ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో గత 11 సంవత్సరాల క్రితం ఎమ్మార్పీఎస్ జెండాతో కాలనీ నిర్మాణం చేయడం జరిగింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంటి పట్టాలు, ఇంటి నెంబర్లు ఇవ్వడం జరిగింది, కానీ కాలనీలో ఇప్పటి వరకు కనీస సౌకర్యాలు, కరెంట్ స్తంభాలు, రోడ్లు, డ్రెయినేజీలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. మంద కొమురమ్మ నగర్ కాలనీకి మీ ఎమ్మెల్సీ ఫండ్ నుంచి కరెంట్ స్తంభాలు ఇప్పించాలని వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్సీ రవీందర్ రావు సానుకూలంగా స్పందించి తప్పకుండా రూ.10 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ మహిళా జిల్లా అధ్యక్షురాలు ఎండీ రజియా, ఎంఎంఎస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కత్తుల రేణుక, వీహెచ్ పీఎస్ జిల్లా అధ్యక్షులు ఎండీ పాషా, ఎంఎస్పీ జిల్లా నాయకులు కందిపాటి భిక్షపతి, ఈదురు సైదులు పాల్గొన్నారు.

# రౌడీషీటర్లు తీరు మార్చుకోవాలి

## పరకాల ఏసీపీ సతీష్ బాబు



**వరంగల్ వాయిస్, దామెర :** పరకాల ఏసీపీ సీహెచ్.సతీష్ బాబు సోమవారం దామెర పోలీస్ స్టేషన్ సందర్శించి స్టేషన్ రికార్డ్స్ పరిశీలించారు. అధికారులతో, సిబ్బందితో మాట్లాడి తగు సూచనలు చేశారు. అనంతరం పీఎస్ పరిధిలోని రౌడి షీటర్లతో మాట్లాడి, మంచి ప్రవర్తన కలిగి ఉండాలని, వారు మళ్లీ ఎలాంటి కేసులలో ఇన్వాల్వ్ అయిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. దామెర ఎస్సై అశోక్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# ఏకశిలా స్కూల్ లో ప్రీ క్రిస్మస్ వేడుకలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని రెడ్డి కాలనీ ఏకశిలా కాన్సెప్ట్ పాఠశాలలో సోమవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ప్రాథమిక స్థాయి విద్యార్థులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా క్రీస్తు పుట్టిన ప్రదేశంగా గడ్డితో పాకను నిర్మించారు. నిర్మించిన పాకలో ఏసుక్రీస్తు ప్రతిమను పెట్టి చుట్టూరా ఆకులు, కొమ్మలు, బెలూన్లతో రంగురంగుల పూలతో అందంగా అలంకరించి శోభాయమానంగా పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు నేటితరానికి నిత్య అనుసరణీయమన్నారు. క్రిస్మస్ క్రైస్తవుల పండుగ అయినప్పటికి అన్నీ మతాల వారు సమానంగా గౌరవించాలని, సోదర భావంతో కలిసి మెలిసి వుండాలని పిలుపునిచ్చారు. ఇలాంటి విశిష్టతను



విద్యార్థులకు తెలియచేయడానికి పాఠశాలలో అన్ని మతాల పండుగలను నిర్వహించుకునేలా వారిని ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ స్వప్న రెడ్డి , ఉపాధ్యాయులు శోభ, పావని, సుమాంజలి, హరిత, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.





# ప్రజావాణిలో సమస్యల పరిష్కారం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.వీరబ్రహ్మాచారి, జిల్లా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, ప్రజల వద్ద నుంచి దరఖాస్తుల స్వీకరించి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డీసీఓ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో పురుషోత్తం, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహస్వామి, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డీఈవో రవీందర్ రెడ్డి, డీవీహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, ఏడీ ల్యాండ్ సర్వే నరసింహమూర్తి, డీపీఓ హరిప్రసాద్, డీడీ గ్రౌండ్ వాటర్ వేముల సురేష్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ సైదా నాయక్, డీఎం సివిల్ సప్లై కృష్ణవేణి, అన్ని విభాగాల అధికారులు కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సోమవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పిటల్ లోని డయాలసిస్ కేంద్రం, ఫార్మసీ, ఇన్ పేషంట్ల వార్డ్స్ , సాధారణ వార్డులను తిరుగుతూ చికిత్స పొందుతున్న పేషెంట్లకు అందుతున్న వైద్య సేవల వివరాలు వారిని అడిగి తెలుసుకున్నారు, అత్యవసర పరిస్థితులలో వచ్చే ప్రతి ఒక్కరికి వైద్య చికిత్సలు అందించాలని, వైద్య పరీక్షలు వెంట వెంటనే నిర్వహించి చికిత్సలు చేయాలన్నారు. ఆస్పత్రి ఆవరణంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్ ను తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు, నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలన్నారు. ఆస్పత్రిలోని పెండింగ్ లో ఉన్న విస్తరణ, అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. హాస్పిటల్ లో డాక్టర్స్, వైద్య సిబ్బంది, నిత్యం అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించాలని సూచించారు. కలెక్టర్ వెంట హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ శ్రీనివాస్, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ గఫార్, సిబ్బంది ఉన్నారు.

# వినియోగదారుల చట్టంపై అవగాహన అవసరం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరల్డ్ వైజ్ కన్జ్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో నేషనల్ వైస్ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల చట్టం-2019, రక్షణ, బాధ్యతలపై అవగాహన కార్యక్రమాలు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు విరివిగా నిర్వహించాలన్నారు. వినియోగదారుల హక్కుల చట్టంపై పల్లెల నుంచి పట్నం వాసుల వరకు పిల్లల నుంచి పెద్దల వరకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. చిన్నతనం నుండే వినియోగదారులు మెలుకువలు నేర్చు కోవాలన్నారు. ప్రజలను చైతన్యం చేసి ఎవరు మోసపోకుండా చేయడమే తమ లక్ష్యమని అన్నారు. వరల్డ్ వైజ్ కన్జుమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ అవగాహన కార్యక్రమాలల్లో ముందుంటుందని బయట తినే పదార్థాలలో జరిగే మోసాలు ఎలా ఉంటాయి, వస్తువులు కొంటే ఏ విధంగా మోస పోతున్నారు అనేది ఉదాహరణలతో సహ చక్కగా వివరిస్తున్నామన్నారు. అలాగే ప్రతి వస్తువు కొన్నప్పుడు బిల్లు, గ్యారెంటి కార్డు, వారెంటీలను తీసుకోవాలని తెలిపారు. అప్పుడు మనకు ఏదైనా ఇబ్బందులు ఎదురైనప్పుడు కేసు వేయడానికి ఇవి ఉపయోగపడ తాయన్నారు. ముఖ్యంగా పిల్లలకు, గ్రామీణ వాసులకు వినియోగ దారుల చట్టంపై అవగాహన కల్పించి ప్రజలు మోసపోకుండా చేస్తానని, ఎవరైనా మోసపోతే వారిచే వినియోగ దారుల కోర్టును వినియోగించుకుని ఎలా బయట పడాలో దగ్గర ఉండి కోర్టులో వేయించి న్యాయం చేస్తామన్నారు. చట్టానికి వియోగదారులకు వారధి వరల్డ్ వైజ్ కన్జ్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ అని డాక్టర్ అనితా తెలిపారు. మోసాలను అరికట్టడం అంటే నేరాలను తగ్గించి, స్వచ్ఛత, నాణ్యత పెంపొందించడమేనని డాక్టర్ అనితా రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు వస్తువులు విక్రయిస్తున్నారా? నాసిరకం ఉత్పత్తులు అంటగట్టి సేవాలోపానికి పాల్పడ్డారా? అయితే ఇక నుంచి మీ ఇంటి నుంచే వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేయొచ్చు. కేంద్ర వినియోగదారుల మంత్రిత్వ శాఖ ఇందు కోసం 'వాట్సప్ చాట్ బాట్'సేవలను తీసుకొచ్చింది. వాట్సప్ నంబర్ 88000 01915 లో మొదట హాయ్ అని టైప్ చేయాలి. అక్కడి సూచనల ఆధారంగా వివరాలు నమోదు చేస్తే జాతీయ వినియోగదారుల కమిషన్ హెల్ప్‌లైన్‌లో ఫిర్యాదు నమోదవు తుంది. అనంతరం కేసు పరిష్కారం కోసం ఈ వివరాలు ఆయా జిల్లా వినియోగదారుల కమిషన్‌కు పంపుతారు. కేసు పరిష్కారం అయ్యే వరకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తారు. దీంతో పాటు 1800114000 లేదా 1915 నంబర్‌కు కాల్ చేసి సైతం (ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు) ఫిర్యాదు చేయొచ్చునని, ఇంకా సమాచారం లేదా డౌట్స్ ఉంటే తన సెల్ నెంబర్ 9177362072 కు ఫోన్ చేయవచ్చునని డాక్టర్ అనితా రెడ్డి తెలిపారు.



# తెలంగాణ ఠీవి పీవీ నర్సింహా రావు

■ మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** తెలంగాణ ఠీవి పీవీ నర్సింహా రావు అని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో భారతరత్న, మాజీ భారత ప్రధాని పీవీ నర్సింహా రావు వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాజీ చీఫ్ విప్ మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి, ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు పీవీ అని కొనియాడారు. దేశంలోని 14 ప్రధాన భాషలు మాట్లడగలిగే బహుభాషా కోవిదుడు పీవీ అని కీర్తించారు. తెలంగాణ వాడు భారత ప్రధానిగా సేవలందించిన పీవీ తెలంగాణకు, దేశానికి ఎంతో గర్వకారణమని తెలిపారు. రాజకీయ సంక్షోభ సమయంలోనూ సమర్థవంత పాలన అందించిన పరిపాలన దక్షుడు పీవీ అన్నారు. పీవీ నర్సింహారావు కి బీఆర్ఎస్ పార్టీ సముచిత గౌరవం అందించిందని పేర్కొన్నారు. పీవీ శత జయంతి, జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మేకల బాబు రావు, నాయకులు నయీముద్దీన్, సుంచు కృష్ణ, డివిజన్ అధ్యక్షులు సదాంత్, సుహాస్, ఖలీల్, హరినాథ్, నాయకులు రవీందర్ రావు, పరుశురాములు, రవీందర్, జానకీరాములు, మన్సూర్, గౌస్ ఖాన్, ప్రదీప్, దశరథ్, రాజు, విజయ్, శ్రీధర్ రావు, రమేష్, రామకోటి యాకుబ్, వీరస్వామి, రాకేష్ యాదవ్, శ్రీధర్, మహమూద్, సుబ్బు, సర్దార్, దేవమ్మ, విజయ, వెంకన్నతదితరులు పాల్గొన్నారు.

# ఏసుక్రీస్తు మార్గం ఆదర్శనీయం



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీలోని ఫార్మసి కళాశాలలో క్రిస్మస్ వేడుకలు బీఫార్మసీ, ఎంఫార్మసీ విద్యార్థిని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో ముఖ్యఅతిథిగా ఆచార్య గాదె సమ్మయ్య పాల్గొని కేకు కట్ చేసి విద్యార్థిని విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు అంటే శాంతికి మార్గమని, ఏసుక్రీస్తు బోధనలు మానవ జాతికి ఎంతో అవసరమన్నారు. ఏసుక్రీస్తు వలే ప్రతి విద్యార్థిని విద్యార్థి శాంతియుతంగా ప్రేమగా జీవించాలని, నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించాలని, క్షమాగుణం, ప్రేమ, సాత్వికము, దీర్ఘశాంతము, నీతి, సత్ క్రియలను అలవర్చుకోవాలని క్రిస్మస్ అంటే మనిషిని సన్మార్గంలో నడిపించే దైవిక భావన అని తెలిపారు. పరలోకం కోసం ఏసుక్రీస్తు మార్గం కావాలని, నిన్ను ప్రేమించినట్లుగా ఇతరులను ప్రేమించాలని, శాంతి మార్గంలో నడవాలని, ధర్మం,సత్యం,న్యాయానికి కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. ఈ వేడుకలలో డాక్టర్ సునీత, డాక్టర్ సుజాత, డాక్టర్ సుకన్య, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ శశిధర్, 200 వరకు విద్యార్థులు పాటలు పాడి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని, తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. క్రిస్మస్ సంబరాలు విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన బిఫార్మసీ ఫైనల్ ఇయర్ విద్యార్థిని విద్యార్థులకు ప్రత్యేకంగా అభినందించారు.

# మున్సిపల్ కమిషనర్ ను బదిలీ చేయాలి

## ఫిర్యాదు దారుల పట్ల కమిషనర్ తీరు సరికాదు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తే వాటి పైన విచారణ చేసి చర్యలు తీసుకోవాల్సింది పోయి ఫిర్యాదు దారుల పట్ల పరోక్షంగా (హెచ్చరికలు) బెదిరింపులకు పాల్పడుతున్న మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకాడేను బదిలీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి డిమాండ్ చేశారు. గ్రేటర్ పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే వాటిపై చర్యలు తీసుకోవాలని అనేకసార్లు గ్రీవెన్స్ సెల్ ద్వారా ఫిర్యాదు చేస్తే పట్టించుకోకుండా చర్యలు తీసుకోని అధికారులపై స్పందించని కమిషనర్, అనుమతి లేని భవనాలపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రాలు ఇస్తుంటే ఇచ్చే వారి భవన అనుమతి పత్రాలు చూపెట్టాలని, వారి అనుమతి పత్రాలను చూపెట్టాకే అవి సరిగ్గా లేకుంటే వారి మీద, చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం సరైనది కాదన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పెట్టే వారిపై చర్యలు తీసుకోవాలని కోరితే, కమిషనర్ మాత్రం ఫిర్యాదు చేసేవారి మీద ఆవేశం వెళ్లగక్కడం ఏంటని ప్రశ్నించారు. భారత పౌరులుగా ప్రజా సంఘాల నాయకులు, సమాజంలో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదు చేస్తుంటే ఫిర్యాదు చేయడమే సరైనది కాదనే విధంగా వ్యవహరించడం కమిషనర్ తీరుకు నిదర్శనమన్నారు. ఆమెను వెంటనే బదిలీ చేయాలని, దీనిపై ఉన్నత అధికారులకు, ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామని తిరుపతి తెలిపారు.

# విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ అందజేత



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు టీచర్స్ ఆధ్వర్యంలో టీచర్స్ క్లబ్ సిగ్నేచర్ ప్రాజెక్ట్ అయిన ఆల్ ఇన్ వన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా సోమవారం వడ్డే కొత్తపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో క్లబ్ అధ్యక్షుడు చింతల సురేష్ అధ్యక్షతన పెద్ద వంగర మండలం వడ్డేకొత్తపల్లి పాఠశాల లో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెలిదే సురేష్ కుమార్-సంధ్యారాణి ఆర్థిక సహకారంతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్, ఎగ్జామ్ మెటీరియల్, స్వీట్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన లయన్స్ క్లబ్ ఎఫ్.డబ్ల్యూసీ డాక్టర్ వేలూరి శారద మాట్లాడుతూ అవసరార్థులకు, అన్నార్తులకు సేవ చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థితిలో ఉండాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు పదో తరగతి పరీక్షలు ఎలా ఎదుర్కోవాలనే అంశంపై సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చింతల సురేష్ మాట్లాడుతూ విద్యార్థులకు మెటీరియల్ అందించిన వెలిదే సురేష్ కుమార్-సంధ్యారాణి దంపతులకు ధన్యవాదాలు తెలియజేస్తూ, టీచర్స్ క్లబ్ సేవే మార్గం సేవే లక్ష్యంతో పనిచేస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతిలో ఉత్తమ ఫలితాల సాధన కోసం టీచర్స్ క్లబ్ విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ అందజేస్తుందని, విద్యార్థులు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ ను ఉపయోగించుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా దాత వెలిదే సురేష్ కుమార్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ఉత్తమ ఫలితాల సాధన కోసం విలువైన సలహాలు సూచనలు అందించి, విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు పాఠశాలకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు శేషపల్లి టీచర్స్ క్లబ్ వారు తమ పాఠశాలకు మెటీరియల్ అందించడం పట్ల ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చింతల సురేష్, క్లబ్ ప్రధాన కార్యదర్శి వెలిదే సురేష్ కుమార్, క్లబ్ పూర్వ అధ్యక్షులు రాయపల్లి యాకయ్య, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ ఇల్లందుల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీ



**వరంగల్ వాయిస్, కేయూ :** ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీ. నరసింహ రావు అని విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి అన్నారు. సోమవారం కాకతీయ విశ్వవిద్యాలయ పీవీ నాలెడ్జ్ సెంటర్ సంచాలకులు డాక్టర్ జి.కృష్ణయ్య అధ్యక్షతన "భారత మాజీ ప్రధానమంత్రి పీవీ.నరసింహా రావు వర్ధంతి" సమావేశం విశ్వవిద్యాలయ పొలిటికల్ సైన్సు విభాగ సెమినార్ హాల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా క్లిష్ట సమయంలో దేశాన్ని గట్టెక్కించిన వ్యక్తి మన వాడు కావటం గొప్ప విషయమన్నారు. అయనను నేటి యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, పాలక మండలి సభ్యులు ఆచార్య బి.సురేష్ లాల్, డాక్టర్ చిర్రా రాజు, కే.అనిత రెడ్డి, దూర విద్య కేంద్ర సంచాలకులు ఆచార్య వి. రామచంద్రం, పొలిటికల్ సైన్సు విభాగ అధిపతి డాక్టర్ సంకేనేని వెంకటయ్యతో పాటు విశ్రాంత ఉద్యోగ సంఘ బాధ్యులు ఆచార్య ఎ.సదానందం, ఆచార్య వి.రవీందర్, ఆచార్య కె.సుధాకర్ తో పాటు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పీవీ నరసింహారావుకు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** భారతదేశ తొలి తెలుగు ప్రధాని, ఆర్థిక రంగ నిపుణుడు, తెలంగాణ ముద్దుబిడ్డ స్వర్గీయ పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా తొర్రూరులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ పీవీ సేవలు ఎనలేనివన్నారు. ఆయన చొరవ తీసుకొని నూతన ఆర్థిక విధానాల ద్వారా భారత దేశంలో అనేక సంస్కరణలు అమలు చేయడం ద్వారా భారత దేశం ప్రగతి పథంలో ముందుకు సాగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు సోమ రాజశేఖర్, సోమన్న, జయపాల్ రెడ్డి, వెంకన్న, కుమార్, యాకయ్య పాల్గొన్నారు.

# సీఎం కప్ రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఆర్డీఎఫ్ విద్యార్థులు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** సీఎం కప్ క్రీడలలో ఆర్డీఎఫ్ కళ్లెడకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి చేరుకున్నారు. జి.సందీప్ 100మీ., 200 మీటర్లలో మొదటి స్థానం, ఎ.బిందుశ్రీ 800మీ మొదటి స్థానం, 100మీ లో రెండవ స్థానం దక్కించుకోగా, పి.చరణ్ తేజ జావెలింగ్ త్రో లో రెండవ స్థానం, ఎల్. నవ్య, ఎల్. నిషా కబడ్డీలో మొదటి స్థానంలో నిలిచారు. ఈ నెల 27 నుండి జరిగే రాష్ట్ర స్థాయి సీఎం కప్ కు లో వీరు ఆడనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ అశోక్ చారి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, మహేందర్, కోఆర్డినేటర్ అనిల్, సంతోష్, రమేష్, రాజు, తదితరులు అభినందించారు.

## సెయింట్ ఆగ్నెస్ లో క్రిస్మస్ వేడుకలు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మండల కేంద్రంలోని సెయింట్ ఆగ్నెస్ స్కూల్ లో మిని క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఏసు ప్రభు జన్మ వృత్తాంతాన్ని అర్థమయ్యే విధంగా పశువుల పాక, క్రిస్మస్ ట్రీ ఏర్పాటు చేశారు. మినీ క్రిస్మస్ వేడుకలలో భాగంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులచే నృత్యాలు, నాటికలు నిర్వహించి పలువురికి గిఫ్ట్ లు అందించారు. కరెస్పాండెంట్ అంథొని పసాల, ప్రిన్సిపల్ హెలన్ రాణి టీచర్లు పాల్గోన్నారు.

## ముందస్తు క్రిస్మస్ వేడుకలు



**వరంగల్ వాయిస్, దామెర :** దామెరలోని ఏకశిల ప్రైమ్ పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. ఏకశిల విద్యాసంస్థల డైరెక్టర్ బేతి కొండల్ రెడ్డి పాల్గొని క్రిస్మస్ పండుగ విశిష్టతను తెలియజేశారు. వివిధ పాటలకు డాన్స్, పాటలు పాడిన విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ మణికుమార్, స్టాఫ్ ఇంచార్జి విజయ్ కుమార్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేడియోలో అలరించిన కరీమాబాద్ విద్యార్థులు



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కరీమాబాద్ లో చదువుతున్న విద్యార్థులు రేడియో కార్యక్రమంలో పాల్గొని అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. విద్యార్థులు వరంగల్ ఆకాశవాణి కేంద్రం లో పాటలు, పద్యాలు శ్లోకాలు జీకే క్వశ్చన్స్ ,జీవిత చరిత్ర, నీతి కథలు చెప్పడంలో అద్భుతమైన ప్రతిభను కనబరిచి అందరినీ అలరించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా ఉపాధ్యాయుడు పోగు అశోక్, గైడ్ టీచర్ గా కరుణకుమారి వ్యవహరించగా విద్యార్థులు, ఉపాధ్యాయుడు వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేడియో కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను, ఉపాధ్యాయులను, పాఠశాల ఇంచార్జి హెడ్మాస్టర్ పుట్టా రమేష్, ఉపాధ్యాయులు కొంగ శ్రీనివాస్, శ్రీవాణి, రాజమౌళి, తిలక్, శైలజ, నారాయణ రెడ్డి మురళీధర్ రావు, ప్రగతి కుమార్ తదితరులు అభినందించారు.

## డ్రంకెన్ డ్రైవ్ లో ఒకరికి సామాజిక సేవ శిక్ష

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ పర్యవేక్షణ లో డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన(32) మంది వ్యక్తులను మేజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేశం ఎదుట హాజరు పరచారు. దీంతో మంద రమేష్ అనే వ్యక్తికి రూ. 2000 జరిమానా, మూడు రోజుల సామాజిక సేవ శిక్ష విధించారు. అతడిని వరంగల్ తహశీల్దార్ వద్దకు పంపి, మిగతా (31) మంది వ్యక్తులకు రూ.38,100 జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఇద్దరిని కోర్టులో హాజరు పర్చగా వారికి రూ.1000 జరిమానాను విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.రామకృష్ణ తెలిపారు.

# ప్రభుత్వ పథకాలను యువత సద్వినియోగం చేసుకోవాలి

**➲ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రభుత్వ పథకాలను యువత సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. జిల్లా కలెక్టర్ సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో (డీఐపీసీ) జిల్లా స్థాయి ఇండస్ట్రియల్ ప్రమోషన్ కమిటీ సమావేశం జరిగగగా అందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ టీ–ప్రైడ్ స్కీమ్ ద్వారా జిల్లాలోని షెడ్యూల్ ట్రైబ్ (ఎస్టీ) (31) మందికి రూ. 95,61,860/– లక్షలు.,షెడ్యూల్ క్యాస్ట్ (ఎస్సీ) 05, మందికి రూ.15,89,506 లక్షలు, మొత్తం రూ.1,11,51,366 నిధుల కేటాయింపు కోసం కమిటీ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం (36) మంది ఎస్సీ, ఎస్టీ, లబ్ధిదారులకు సబ్సిడీ ఋణాల ప్రతిపాదనలు పంపామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు పీఎం విశ్వకర్మ, టీ ప్రైడ్, తదితర సౌకర్యాల ద్వారా జిల్లాలోని యువతీ, యువకులు వ్యాపార రంగాల్లో ప్రవేశించి ఉపాధి అవకాశాలను పొందాలని సూచించారు. పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్, పౌల్ట్రీ ఫామ్, రైస్ మిల్లు, జేసీబీ, లారీలు, చిల్లి వ్యాపారం తదితర, వాణిజ్య వ్యాపారాలు ఉన్నాయని, ప్రజలు వాటినిఉపయోగించుకోవాలన్నారు. యువతీ, యువకులు, ప్రజలకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలపై పూర్తి అవగాహన కల్పించాలని సంబధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఏ.సత్యనారాయణ, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ సైదా నాయక్, ఎస్సీ, ఈడీ శ్రీనివాస్, ఏటీఓ సత్యనారాయణ, ఆర్ టీఓ సాయి చరణ్, లీడ్ బ్యాంకు మేనేజర్ మూర్తి, అధికారులు, సంబధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప పడిపూజ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వివేకానంద కాలనీలో నవచైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి దివ్య పడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. పూజా అనంతరం మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నవచైతన్య యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లి నాగేశ్వరరావు, కర్ణ కంటి ప్రవీణ్, కాసుల శ్రీధర్, గడ్డం దిలీప్, భాష బోయిన అనిల్, స్వాములు శ్రీ పెల్లి రమేష్, కర్ణ కంటి శ్రీనివాస్, బీనపెల్లి రాజేష్ రూపి రెడ్డి జగన్ రెడ్డి, కర్ణ కంటి శ్రీనివాస్, అల్లి నవీన్, నకుల్, బాలోజు రాజు, బాలాజీ కార్తీక్, లక్ష్మణ్, పొన్నాజు చక్రపాణి, కాలనీ పెద్దలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి చేయూత



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని ఒగ్లాపూర్ గ్రామంలో మన్నెం అనంతరెడ్డి ఇటీవల మృతి చెందాడు. ఆయనతో పాటు 1978–1979లో దామెర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుకున్న తరగతి మిత్రులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపి, తామున్నామంటూ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఒగ్లాపూర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎస్ఐ తాడికొండ లక్ష్మీనారాయణతో పాటు వనజ, కట్ట రవీంద్రాచారి, దామెర సురేందర్, రాంభూపాల్ రెడ్డి, జితేందర్ జీ, నరేందర్ జీ సోమవారం రూ. 6000లు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ రెడ్డి రాజిరెడ్డి, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఏడు కేజీల గంజాయి లభ్యం

### నిందితుడి అరెస్ట్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ రైల్వేస్టేషన్ ఏరియాలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఒక వ్యక్తి బ్యాగ్ తో అనుమానస్పదంగా తిరుగుతుండగా అతడిరి పట్టుకొని విచారించగా గంజాయి ప్యాకెట్లు లభ్యమైనట్లు ఎస్ఐ ఉమా తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆంధ్ర రాష్టంలోని విశాఖపట్నం జిల్లా జీకే వీధి మండలానికి చెందిన కిముడు గోపి నాలుగు సంవత్సరాల క్రితం ఒడిశా రాష్ట్రం మల్కాన్ గిరి జిల్లా దిశాయిగూడ గ్రామానికి చెందిన పద్మ అనే అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం వారికి నాలుగు నెలల బాబు ఉన్నాడు. రెండు నెలల క్రితమే తన భార్య అనారోగ్యంతో చనిపోగా తను చేసే సుతారి కూలీ పనులతో వచ్చే డబ్బులు సరిపోక ఎలాగైనా సులువుగా, అక్రమంగా డబ్బులు సంపాదించాలని తన స్నేహితుడైన ప్రవీణ్ కుమార్ అను వ్యక్తిని సంప్రదించగా అతడు ఒరిస్సా రాష్ట్రం చిత్రకొండ ఏరియా నుంచి ఆరు ప్యాకెట్ల గంజాయిని బ్యాగులో తీసుకువచ్చి తెలంగాణ రాష్ట్రం వరంగల్ కు తీసుకువెళ్లి అక్కడ తను చెప్పిన వ్యక్తికి అప్పగించి రమ్మని అందుకు డబ్బులు ఇస్తానని నర్సీపట్నం దగ్గర బ్యాగ్ అప్ప చెప్పి వెళ్లాడని వివరించారు. ఈ నెల 22న బస్సు ద్వారా రాజమండ్రి అక్కడి నుండి ఖమ్మం వరకు బస్సులో వచ్చి అక్కడి నుండి శాతవాహన ఎక్స్ ప్రెస్ రైల్ లో వరంగల్ వెళుతుండగా మార్గమధ్యలో డోర్నకల్ వద్ద ట్రైన్ ఆగగా ముందు భోగిలలో పోలీసు వారు చెక్ చేస్తున్నట్లు అనిపించి ట్రైన్ దిగి బయటికి వచ్చాడు. ఈ దరిమిలా వరంగల్ ఎలా వెళ్లాలని ఆలోచిస్తుండగా డోర్నకల్ పోలీసులకు అనుమానం వచ్చి సోదా చేయగా 7 కేజీల గంజాయి (సుమారు రూ.1,75,000) లభ్యమైయిందన్నారు. మరో నిందితుడు కిలో ప్రవీణ్ కుమార్ పరారీలో ఉన్నాడని త్వరలో అతని కూడా అరెస్ట్ చేస్తామని తెలిపారు.

# ఫాతిమానగర్ బిషప్ హౌస్ లో క్రిస్మస్ వేడుకలు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** ఫాతిమానగర్ బిషప్ హౌస్ లో వరంగల్ వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి క్యాథలిక్ వరంగల్ పీఠాధిపతి బిషప్ ఉడుముల బాలను శాలువాతో సన్మానించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్యాథలిక్ వరంగల్ పీఠాధిపతి ఉడుముల బాలా కేక్ కట్ చేసి అందరికి తినిపించారు. వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకలను చిన్న, పెద్ద బీద, ధనిక తార తమ్యాలు లేకుండా ప్రతి ఒక్కరు ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకోవాలని, క్రైస్తవులు ఎల్లప్పుడూ చల్లగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు, టీపీసీసీ ఎస్సీ డిపార్టుమెంటు ప్రధాన కార్యదర్శి ఎంపీ ఆనంద్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ అంకుష్, షేక్ అమర్, రెడ్ క్రాస్ సభ్యులు బిల్లా రమణా రెడ్డి, దయాసాగర్, గజపాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ సినిమా
సోమవారం 23 డిసెంబర్ 2024
7



# అందులో.. నంబర్‌వన్

గూగుల్ సెర్చింగ్‌లో నెంబర్‌వన్‌గా.. త్రిప్తి డిమ్రీ 'యానిమల్'కి ముందు కూడా త్రిప్తి డిమ్రీ సినిమాలు చేసింది. కానీ గుర్తింపు రాలేదు. కానీ 'యానిమల్' తర్వాత రాత్రికి రాత్రి స్టార్ అయి కూర్చుంది. రీసెంట్‌గా ఈ అందాలభామ మరో అఛీవ్‌మెంట్ కూడా సాధించింది. బాలీవుడ్‌లో తన తోటి హీరోయిన్లందర్నీ వెనక్కు నెట్టి నంబర్‌వన్‌గా నిలిచింది. ఇది ఎలా సాధ్యం? అనుకుంటున్నారా!.. అసలు విషయం ఏంటంటే.. అసలే బాలీవుడ్‌లో స్టార్స్ తాకిడి ఎక్కువ. వారందరినీ దాటుకొని గూగుల్ సెర్చ్‌లో నంబర్‌వన్‌గా నిలిచింది త్రిప్తి డిమ్రీ. ఇది కూడా తక్కువ విషయమేం కాదు. ఈ పరిణామంపై తెగ సంబరపడిపోతున్నది ఈ అందాలభామ. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'నా గురించి తెలుసుకోవాలని ఇంతమంది ఉత్సాహపడ్డారంటే అది నిజంగా నా విజయమే. ఈ క్రేజ్‌కి కారణం 'యానిమల్'. థ్యాంక్యూ సందీప్ సార్. 'యానిమల్ 2' కోసం ఎదురు చూస్తున్నా. అందులోనూ అందరూ మెచ్చేలా నా పాత్ర ఉంటుంది.' అంటూ చెప్పుకొచ్చింది త్రిప్తి డిమ్రీ.

## చిరు ఫ్యాన్స్ తిట్టుకున్నా.. పర్వాలేదు



సినిమా విడుదల సమయంలో సెన్సేషనల్ కామెంట్స్ చేసే నిర్మాత సూర్యదేవర నాగవంశీ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మెగాస్టార్ అభిమానులు తిట్టుకున్నా ఫర్వాలేదు. కానీ దర్శకుడు బాబీ 'వాల్తేరు వీరయ్య' కంటే 'డాకు మహారాజ్' సినిమాని బాగా తీశాడు' అని కామెంట్స్ చేశాడు. ఈ విషయంలో చిరంజీవి ఫ్యాన్స్ తనని తిట్టుకున్నా పర్లేదని స్టేట్ మెంట్ ఇచ్చారు. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బాలకృష్ణ హీరోగా బాబీ దర్శకత్వంలో నాగవంశీ నిర్మించిన చిత్రం 'డాకు మహరాజ్'. శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్ కథానాయికలు. బాబీ దేవోల్, చాందిని చౌదరి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా జనవరి 12న థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ సినిమాలో ఆయన్ని చాలా కొత్తగా చూస్తారు. ఇప్పటివరకు ఏ సినిమాలోనూ ఇలాంటి లుక్‌లో ఆయన కనిపించలేదు. అఖండ, లెజెండ్ గురించి ఎలా చెప్పుకుంటున్నారో దీని గురించి కూడా అలానే మాట్లాడుకుంటారు. సినిమా ఇంటర్వెల్‌లోనే నాకు ఫోన్ చేసి ఈ మాట చెబుతారు. ఈ సినిమాకు సంబంధించి మూడు గ్రాండ్ ఈవెంట్స్ ప్లాన్ చేశాం. జనవరి 2న హైదరాబాద్‌లో ట్రైలర్ రిలీజ్ చేయాలనుకుంటున్నాం. తర్వాత రెండు రోజులకు అమెరికాలో ప్రీరిలీజ్ ఈవెంట్ చేసి అక్కడ ఓ పాటను విడుదల చేయనున్నాం. జనవరి 8న ఆంధ్రప్రదేశ్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ ప్లాన్ చేస్తున్నాం.

---


## ఈసారి ఆ తప్పు జరగదు



ప్రభాస్ 'సలార్' సినిమా విడుదలై ఏడాది పూర్తయింది. ప్రశాంత్‌నీల్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 700కోట్ల వసూళ్లను రాబట్టిన విషయం తెలిసిందే. ఈ సినిమా చివర్లో దర్శకుడు ప్రశాంత్‌నీల్ 'సలార్ 2 శౌర్యాంగపర్వం'ను కూడా ప్రకటించేశాడు. దాంతో అభిమానులు సెకండ్ పార్ట్ కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో వారందరికోసం 'సలార్ 2' అప్‌డేట్‌ని ఇచ్చేశారు ప్రశాంత్‌నీల్. ఆయన మాట్లాడుతూ ' 'సలార్' భారీ విజయాన్ని సాధించినా.. ఒక దర్శకుడిగా ఆ సినిమా విషయంలో పూర్తి సంతృప్తిగా లేను. ఎక్కడో 'కేజీఎఫ్' ఛాయలు ఆ సినిమాలో కనిపిస్తుంటాయి. 'సలార్ 2 శౌర్యాంగపర్వం'లో మాత్రం ఆ తప్పు జరగదు. ఓ కొత్త సినిమాను ప్రేక్షకులు చూస్తారు.' అని చెప్పుకొచ్చారు.

# కింగ్ ఆఫ్ ఇండియన్ సినిమా

క్రికెట్‌కు సచిన్ ఎలాగో, ఇండియన్ సినిమాకు శంకర్‌గారు అలా. అలాంటి శంకర్‌గారితో పనిచేయడం నా అదృష్టం. నానుంచి సోలో ఫిల్మ్ వచ్చి అయిదేళ్లయింది. ఇది నాకు ప్రత్యేకమైన సినిమా. ఈ మూవీ ఏ ఒక్కర్నీ నిరాశపరచదు.' అని రామ్‌చరణ్ అన్నారు. ఆయన హీరోగా రూపొందుతున్న చిత్రం 'గేమ్ ఛేంజర్'. ఎస్.శంకర్ దర్శకత్వంలో దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక పాన్ ఇండియా సినిమా జనవరి 10న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ అమెరికా డల్లాస్‌లో గ్రాండ్‌గా జరిగింది. ఈ కార్యక్రమానికి అగ్ర దర్శకుడు సుకుమార్ అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ''రంగస్థలం'కు రామ్‌చరణ్ జాతీయ అవార్డు తీసుకుంటాడని ఆశించా. కానీ రాలేదు. అయితే.. 'గేమ్ చేంజర్' ట్కక్లైమాక్స్ చూశాక, ఈ సినిమాలోని రామ్‌చరణ్ నటనకు పక్కాగా జాతీయ అవార్డు వస్తుందనిపించింది.' అని తెలిపారు. ' శంకర్‌గారి సినిమా సెల్‌ఫోన్‌లో చూస్తే ఫీల్ రాదు. దాన్ని బిగ్ స్కీన్‌పైనే ఎక్స్‌పీరియన్స్ చేయాలి. శంకర్ మాట్లాడుతూ 'పోకిరి, ఒక్కడు లాంటి మాస్ మసాలా సినిమా చేయాలి.. కానీ అందులో కూడా నా మార్క్ ఉండాలి అనుకొని ఈ 'గేమ్‌ఛేంజర్' చేశాను. ప్రభుత్వోద్యోగి, పొలిటీషియన్ మధ్య జరిగే సంఘర్షణే ఈ సినిమా. రామ్‌చరణ్ సెటిల్డ్‌గా చేశాడు. పంచెకట్టులో అప్పన్నగా అదరగొట్టేశాడు. ఈ సినిమాకి అందరూ ప్రాణం పెట్టి పనిచేశారు. రేపు ఆ కష్టాన్ని తెరపై చూస్తారు.' అని శంకర్ చెప్పారు.



# క్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకం

- దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- కలెక్టర్, మేయర్ తో కలిసి ముందస్తు క్రిస్మస్ వేడుకలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి మార్గదర్శకమని రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వరంగల్ ఓ సీటీలోని మంత్రి క్యాంప్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ముందస్తు క్రిస్మస్ వేడుకలకు మంత్రి సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, పాస్టర్లలతో కలిసి కేక్ కట్ చేశారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని పాస్టర్ లందరికీ మంత్రి తన సొంత ఖర్చుతో దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఏసు బోధనలు ఒక మతానికి సంబంధించినవి కావని యావత్తు మానవాళికి మార్గదర్శకత్వం చేసేవి అని తెలిపారు. ఏసుక్రీస్తు మనుషులందరిని ప్రేమించాలి, సత్య మార్గంలో నడవాలి, సేవా భావంతో మెలగాలని అన్న క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆచరణీయమన్నారు. అన్ని మతాల సారాంశం మానవత్వమేనని ప్రపంచానికి బోధించిన శాంతి దూత యేసు అని అన్నారు. ఈ సందర్భంగా లేబర్ కాలనీ సీబీసీ చర్చి అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన కోటి రూపాయల నిధుల జీవో ప్రతిని మంత్రి పాస్టర్లకు అందజేశారు. క్రిస్టియన్ మైనార్టీల సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నదని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండు చందన పూర్ణ చందర్, పల్లం పద్మ, భోగి సువర్ణ, బైరబోయిన ఉమ, సురేష్ జోషి, చింతాకుల అనిల్ కుమార్, పోశాల పద్మ, కావేటి కవిత, మరుపల్ల రవి, బాల్నే సురేష్, సోమిశెట్టి ప్రవీణ్ కుమార్, ఫుర్ఖాన్, జిల్లా మైనార్టీ, బీసీ సంక్షేమ అధికారులు పుష్పలత, రమేష్ తహసిల్దార్లు ఇక్బాల్, నాగేశ్వరరావు, వివిధ క్రైస్తవ సంఘాల పాస్టర్లు జగ్జీవన్ బాబ్జి, పీఆర్ సల్మాన్, దీన్ దయాల్, ప్రేమ అరుణ్, ఫాస్టర్లు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.



# సేవలో లభించే సంతృప్తి వెలకట్టలేము

## చెన్నూరు క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు బ్లాంకెట్ల వితరణ

**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** అవసరార్థులకు సేవ చేయడంలో లభించే సంతృప్తి వెలకట్టలేమని లయన్స్ ఇంటర్నేషనల్ పూర్వ జిల్లా గవర్నర్ లయన్ కన్నా పరశురాములు అన్నారు. సోమవారం ఉదయం పాలకుర్తి మండలం చెన్నూరు గ్రామంలో లయన్స్ క్లబ్ చెన్నూరు ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లాంకెట్ల వితరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. క్లబ్ అధ్యక్షుడు కారుపోతుల వేణు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రీజియన్ చైర్మన్ కలువల భాస్కర్ రెడ్డి బంధువైన విశ్రాంత అధ్యాపకులు కె.ఇంద్రసేనారెడ్డి దాతృత్వంతో బ్లాంకెట్ల వితరణ చేశారు. రీజియన్ చైర్మన్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ క్లబ్ చార్టర్ అధ్యక్షుడు వేణు ఆధ్వర్యంలో గ్రామంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారని త్వరలో మెగా ఆరోగ్య పరీక్షా శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ బజ్జూరి వేణుగోపాల్, క్లబ్ కార్యదర్శి కారుపోతుల వెంకటయ్య, కోశాధికారి పి.రమేశ్, సభ్యులు బి.మహేందర్, ఎం.హరీష్, జి.వాసు, బి.శ్రీనివాస్, డి.గణేష్, ఎన్.ప్రభాకర్, పి.వెంకన్న, పి.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

# మీకు అండగా ఉంటాం..

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సర్వశిక్ష అభియాన్ లో 1,523 ఉద్యోగాలు ఇచ్చింది మేమే.. మీ సమస్యల పరిష్కారానికి అండగా ఉంటామంటూ మాజీ మత్రి హరీష్ రావు ప్రకటించారు. హనుమకొండ బాలసముద్రంలోని జయశంకర్ వనం (ఏకాశిలా పార్క్) ఎదుట సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల దీక్షా శిబిరాన్ని సోమవారం మాజీ మంత్రి హరీష్ రావు సందర్శించి, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాయ్ తాగినంత సేపట్లో మీ సమస్యలు పరిష్కరిస్తానని చెప్పి, అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా ఇప్పటికీ మీ సమస్యను పరిష్కరించలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, నన్నపునేని నరేందర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాకేష్ రెడ్డి, నాగుర్ల వెంకన్న, నాయకులు, కార్పొరేటర్ లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని సందర్శన..

వరంగల్ జిల్లాలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 24 అంతస్థుల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని మాజీ మంత్రి హరీష్ రావు సందర్శించారు. ఉత్తర తెలంగాణ పేద ప్రజలకు అందుబాటులో ఉండేలా 2,000 పడకల ఆస్పత్రికి శ్రీకారం చుట్టి 2024 జూన్ వరకు రెడీ కావాలని ప్రతిపాదనలు చేస్తే..పనులు నత్తనడకన సాగుతున్నాయన్నరు.

# నర్సంపేట డిపో ఆధ్వర్యంలో టెంపుల్ దర్శనం



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** నర్సంపేట డిపో ఆధ్వర్యంలో నిర్వహించిన టెంపుల్ దర్శనం కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో నర్సంపేట డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మి, భవానీలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం నర్సంపేట డిపో నుంచి బయలుదేరిన బస్సు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్నమయ్య జిల్లాలోగల కాణిపాకం విగ్నేశ్వర టెంపుల్, తమిళనాడులోని వెల్లూరు సిరిపురం గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం అరుణాచలం వద్ద గిరి ప్రదిక్షణ 14కిలోమీటర్లు కాలినడకన పూర్తి చేసుకున్నారు. తీర్థయాత్రలు విజయవంతంగా పూర్తి చేసుకుని తిరిగి క్షేమంగా చేరుకున్న సందర్భంగా యాత్రను ముందుండి నడిపించిన డీఎస్.నారాయణ, కోఆర్డినేట్ సముద్రాల రవీందర్ తోపాటు డ్రైవర్లు ప్రవీణ్, మహేందర్ కు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

# సరళీకృత విధానాల సృష్టికర్త పీవీ

- దేశానికి సరికొత్త మార్గాన్ని చూపిన దార్శనికుడు
- కొనియాడిన ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు
- వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన నేతలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సరళీకృత విధానాలతో ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించి, దేశానికి దశ, దిశ చూపిన మార్గ నిర్దేశకుడు పీవీ.నరసింహారావు అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కొనియాడారు. పీవీ 20వ వర్ధంతి సందర్భంగా సోమవారం హనుమకొండ, వరంగల్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీవీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పీవీ నరసింహారావు అపర చాణక్యుడు, బహుభాషా కోవిదుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి అని ఎంపీ కొనియాడారు. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు కు ఇటీవల 'భారతరత్న' అవార్డు దక్కిందన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు. అనంతరం హనుమకొండ బస్టాండ్ సమీపంలోని మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహానికి ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా అధ్యక్షురాలితో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అమిత్ షా క్షమాపణ చెప్పాలి..

హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. అమిత్ షా వ్యాఖ్యలతో దళిత వ్యతిరేకి అయిన భాజపా ముసుగు వీడిపోయిందన్నారు. ప్రజాస్వామ్య ఆలయంలోనే అంబేద్కర్ పై అవమానకర వ్యాఖ్యం చేయడం దారుణమన్నారు.ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపిన అనంతరం జిల్లా కలెక్టర్ ని కలిసి వినతిపత్రం అందజేయనున్నట్లు ఎంపీ తెలిపారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com